క్లుప్తంగా

ఉద్యానవన అధికారిగా ఉమాభరణి


కమిషనర్‌కు జాయినింగ్ రిపోర్టు అందిస్తున్న బి.ఉమాభరణి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన అధికారిగా బి.ఉమాభరణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడును కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి బదిలీపై వచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా నగర సుందరీకరణ, ల్యాండ్ స్కేపింగ్, అర్బన్ గ్రీనింగ్ వంటి సేవలను ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ, సహకారాలతో సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

నేడు మహిళా కార్మికులకు సన్మానం


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వగృహంలో శుక్రవారం ఉదయం మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానించనున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్య పరిరక్షణలో మహిళా కార్మికుల పాత్ర కీలకమన్నారు. ప్రతిరోజూ నగరంలో చెత్తాచెదారాలను సేకరిస్తూ పరిశుభ్ర వాతావరణన్ని నెలకొల్పుతున్నారని కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య విభాగంలో 170 మంది మహిళా కార్మికులున్నారని.. వారందరినీ సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్


ధర్మపురిలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

విజయనగరం క్రైమ్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసేలా ప్రజలకు భద్రత కల్పించేందుకు పోలీసులు గ్రామాల్లో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జమ్ము, నారాయణపురం, ధర్మపురి, జొన్నవలస గ్రామాల్లో డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై ఆర్.వాసుదేవ్ పర్యవేక్షణలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించి, ప్రజలకు భరోసా కల్పించారు.

ముగిసిన 'లక్ష్య' వార్షికోత్సవం


లక్ష్య - 2024 సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'లక్ష్య' వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన, రోబో రేస్, రోబో వార్‌లలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం వార్షిక సంచిక లక్ష్య - 2024ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, విభాగాధిపతి కె.సుబ్బరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనరేటర్ ప్రారంభం

విజయనగరం ఫోర్ట్: ఘోషా ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ జనరేటర్‌ను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ నిలిచిన సమయంలో ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందే శిశువులకు ఎటువంటి ఇబ్బంది కలగ కూడదనే ఉద్దేశంతో జనరేటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ శుభశ్రీ, పిడియాట్రిక్ విభాగధిపతి డాక్టర్ సుజాతదేవి, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించాలి

విజయనగరం ఫోర్ట్: కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కేన్సర్ వ్యాధిపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 35 ఏళ్లు వయసు దాటిన మహిళలు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రొమ్ములో గడ్డలు, కణితలు, బహిష్ట సమయంలో అధిక రక్తస్రావం అవుతున్న వారికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ సుదర్శి, అనాటమీ హెచ్ఓడీ ఎం.వాసంతి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సునీత, గైనికాలజీ హెచ్ఓడీ అరుణశుభశ్రీ, ఆర్ఎంఓ ఎస్.సురేష్‌బాబు, వైద్యులు శివకుమార్, శ్రీనివాస్‌రావు, శరత్, తదితరులు పాల్గొన్నారు.

శివ పూజకు సిద్ధం..

- ముస్తాబైన శివాలయాలు
- జాగరణ చేసేందుకు భక్తులకు అవకాశం


ఎస్‌వీఎన్ నగర్‌లో ఉన్న పశుపతినాథేశ్వర ఆలయం


కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ శివాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, తదితరులు

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో సేవకులు లింగరూపధారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వేకువజామున 3 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టనున్నారు. పట్టణంలోని ఎస్‌వీఎన్ నగర్‌లోని విజయ గణపతి ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అపర్ణాదేవి సమేత పశుపతినాథేశ్వర ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయంలో కొలువైన స్ఫటికలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భక్తులు వేకువజామునుంచే వస్తారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అమృత శ్రీవర్షిణి సంగీత నృత్యపాఠశాల విద్యార్థినులతో భరతనాట్య ప్రదర్శన.. సాయంత్రం 6 గంటలకు పశుపతి నాథేశ్వరస్వామికి విశేష హారతి, స్ఫటికలింగ దర్శనం కల్పిస్తారు. రాత్రి 7 నుంచి 10.30 గంటల వరకు కాశీక్షేత్రం నుంచి తీసుకువచ్చిన 1,116 సాలిగ్రామాలకు సహస్ర లింగార్చన పూజలు చేస్తారు. రాత్రి 11.30 గంటల నుంచి ఒంటిగంట వరకు లింగోద్భవ సమయంలో స్ఫటిక లింగానికి అభిషేకాలు, అలంకరణ చేపడతారు. అదేవిధంగా కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొలువైన అతి పురాతన మహాశివలింగానికి విశిష్ట పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని దేవదాయశాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి, ఈఓ కె.పద్మావతిలతో కలిసి ఆలయాన్ని గురువారం సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. బాబామెట్టలో ఉన్న శివపంచాయతన ఆలయంలో వేకువజాము నుంచి విశిష్ట పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కేవీపీ రాజు, శివ తెలిపారు. వీటితో పాటు కోట వద్దనున్న మూడుకోవెళ్లు, శివాలయం వీధిలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు శైవక్షేత్రాలు మహాశివరాత్రికి ముస్తాబవుతున్నాయి.


స్ఫటిక లింగం

ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పేద కుటుంబం లబ్ధి పొందిందన్నారు. సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

- సీఎం పాలనకు ఆకర్షితులవుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 36 టీడీపీ కుటుంబాలు


పార్టీలో చేరిన వారిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు పెరుగుతోంది. గడిచిన 4 సంవత్సరాల 10 నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న స్వర్ణయుగ పాలనకు ఆకర్షితులై ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. ఇటీవల జిల్లా యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మన్యాల కృష్ణ ఆధ్వర్యంలో 125 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరగా... నగరంలోని 5,6 డివిజన్‌ల పరిధిలోని యాదవ, విశ్వబ్రాహ్మణ సామాజికవర్గాలకు చెందిన 36 కుటుంబాలు టీడీపీ సీనియర్ కార్యకర్త నైదాన శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కోలగట్ల నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మన్యాల కృష్ణ, బొద్దాన అప్పారావు, గదుల సత్యలతలు మాట్లాడుతూ, విజయనగరం జిల్లా కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గాదం మురళి, పొంతపల్లి మాలతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించాలి

- ఎంపీ బెల్లాన, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ


లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని విజయగనరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని 3,873 మంది సభ్యులకు రూ.7.26 కోట్లు వైఎస్సార్ చేయూత కింద మంజూరు చేశారన్నారు. నెల్లిమర్ల నియోజకర్గంలో 19,544 మందికి రూ.36.66 కోట్లు మంజూరైందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పేద కుటుంబానికీ రూ.4 లక్షల నుంచి 15 లక్షల రూపాయల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. డెంకాడ, నెల్లిమర్ల ఎంపీపీలు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ, పోలిపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ పూసపాటిరేగ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తహసీల్దార్ రామారావు, ఎంపీడీఓ లవరాజు, వైఎస్సార్ క్రాంతిపథం ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

భూహక్కు పట్టాలతో సర్వహక్కులు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ


లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను అందిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

డెంకాడ: భూహక్కు పట్టాలతో లబ్ధిదారులకు సర్వహక్కులు వస్తాయని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు భూహక్కు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదలకు ఇళ్ల స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ పత్రాలు అందివ్వడం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గొప్పతనమన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల వల్ల అత్యవసర సమయంలో ఇంటిని బ్యాంక్‌లో తాకట్టు పెట్టుకుని రుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీఓ లవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, బడుకొండ లక్ష్మి, అంబళ్ల శ్రీరాములనాయుడు, పిన్నింటి తమ్మునాయుడు, మన్యాల కృష్ణ, రొంగలి కనకసింహాచలం, సారిక గౌరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి పెద్దపీట..

యాదవుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. కార్యక్రమంలో భాగంగా గొర్రెలు, మేకల పెంపకందారులకు వలలు, టార్చి లైట్లు, రెయిన్‌కోట్లు అందజేశారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

డెంకాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని గుండాలపేట గ్రామంలో రూ.27.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కాజ్‌వే, సీసీ కాలువలను గురువారం ప్రారంభించారు. అలాగే జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలను ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీటీసీ సభ్యులు గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగత రమణ, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం


గ్రావెల్ రహదారిని ప్రారంభిస్తున్న రమేష్, కమలాకర్‌రెడ్డి, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని అల్లాడ పాలెం గ్రామంలో అరబిందో ఫౌండేషన్ సహకారంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలును వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్‌తో కలిసి పరిశ్రమ ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రావెల్ రహదారి, ఆర్ఓ ప్లాంట్, కాలువలపై పలకలు, శ్మశానంలో భవనాన్ని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అరబిందో పరిశ్రమ జీఎం కమలాకర్‌రెడ్డి, శ్రేయస్ మేనేజర్ గోపాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట..

పూసపాటిరేగ: టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు కుమారులు.. కర్రోతు సోదరుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. మండలంలోని రెల్లివలసలో మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు స్వగ్రహంలో గురువారం జరిగిన అంతర్గత సమావేశంలో ఇరువురు కుటుంబీకులు ఒకరుపై ఒకరు దుమ్మెత్తుకు పోసుకున్నట్లు సమాచారం. కర్రోతు బంగార్రాజుకు టికెట్ రాకుండా అడ్డుకున్నది మీరే అని.. ఆర్థికంగా నష్టపరిచారని బంగార్రాజు సోదరుడు కర్రోతు సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామి కుమారులు పతివాడ అప్పలనాయుడు, పతివాడ తమ్మునాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన తమను కాదని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవిని దొడ్డిదారిన మీరే తెచ్చుకున్నారని.. టీడీపీ అధిష్టానం టికెట్ ఇవ్వకపోతే మేమేం చేస్తామని పతివాడ సోదరులు ఎదురు దాడికి దిగారు. ఇలా మొదలైన వాగ్వాదం ఇరువర్గాల మధ్య తారాస్థాయికి చేరింది. నెల్లిమర్ల టికెట్‌పై పూర్తి క్లారిటీ వచ్చేవరకు సంయమనం పాటించాలని కర్రోతు సోదరులు సూచించగా... ఆలస్యం చేస్తే టీడీపీ క్యాడర్ జనసేనకు వెళ్లే ప్రమాదం ఉందని తమ్మునాయుడు వాదించారు. ఇలా సుమారు అరగంటపాటు పతివాడ సోదరులు, కర్రోతు సోదరుల మధ్య మాటల యుద్ధం సాగింది. చివరకు జనసేనతో కలసి ప్రచారం వెళ్తామని పతివాడ సోదరులు తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ సమావేశంలో నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు..

- ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి


భోగాపురం: ఎంపీడీఓ చంద్రకళను సన్మానిస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత

భోగాపురం: పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ జి. చంద్రకళ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలతో కలిసి నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో పాటు సమాన హక్కులు కల్పిస్తున్నాయని, వాటిని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పథకాన్నీ మహిళలకే అందజేస్తూ వారి గౌరవాన్ని పెంపొందిస్తున్నారని చెప్పారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పడాల మంజులత, పడాల భానుప్రకాష్, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, డీటీ శ్రీనివాసరావు, వైద్యాధికారి వి. లత, ఎస్సై సూర్యకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ శాంతిలత, నాగమణి, వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత..

విజయనగరం టౌన్: జీహెచ్‌వీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధిక పట్టణానికి చెందిన మహిళకు మహిళా దినోత్సవం సందర్భంగా కుట్టుమిషన్‌ను అందజేశారు. ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, గౌరవ సలహాదారు ఎస్. అచ్చిరెడ్డి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతంగా మారాలి..


విజయనగరం: ర్యాలీని ప్రారంభిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెంది శక్తివంతంగా మారాలని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. మహిళా పార్కులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పాల్గొన్నారు. అనంతరం డ్వాక్రామహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పిన్నింటి కళావతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళా ప్రగతి సామాజిక అభివృద్ధికి కొలమానం

విజయనగరం: మహిళా ప్రగతి సామాజిక అభివృద్ధికి కొలమానమని ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జామి అప్పలసూరి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మోహన్ మాస్టార్ గ్రంథాలయం ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా కాలనీకి చెందిన ఎనిమిది మంది మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేవీ రమణమూర్తి, కర్రోతు సత్యం, ఫోర్ ఎస్ రాజు, కొత్తిలి ఎర్నాయుడు, త్యాడ చిరంజీవిరావు, చిన్నారావు, నారాయణరావు, సన్యాసిరాజు, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పూసపాటిరేగ: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని తహసీల్దార్ ప్రవల్లికప్రియ ఆకాంక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఉత్తమసేవలు అందించిన ఎంపీడీఓ రాధిక, వ్యవసాయ అధికారి కె. నీలిమ, డిప్యూటీ తహసీల్దార్ పి. లావణ్య, ఉపాధి హామీ పథకం ఏపీఓ రత్నమాల, మహిళా పోలీస్ మౌనికలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.మాధురి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా..

విజయనగరం అర్బన్: పట్టణంలోని వివిధ ప్రభుత్వ సంస్థలు, బ్యాంక్‌లు, విద్యాసంస్థల్లో అంతార్జాతీయ మహిళా దినత్సోవం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) సీహెచ్.అప్పలనారాయణ ఆధ్వర్యంలో ఆర్టీసీ మహిళా కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ చైర్‌పర్సన్ హిమబిందు, డిప్యూటీ సీఏఈ కె. శ్రీనివాసరావు, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఏటీఎం సీఎస్ఎంటీ హెచ్.దివ్య, సూపర్‌వైజర్లు, వివిధ యూనియన్ సంఘాలు పాల్గొన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ప్రాంగణంలో..తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో..రెవెన్యూ హోమ్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు.

హక్కులు కాపాడుకోవాలి


నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ సరోజిని, అధికారులు, మహిళలు

నెల్లిమర్ల: ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలంతా కలిసి తమ హక్కులు సాధించుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పిలుపు నిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లతో బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మంటపంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సముద్రపు రామారావు, కమిషనర్ పి.బాలాజీప్రసాద్, డీవీవీఎస్ఎన్ మూర్తి, మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, ఎ. రాజ్యలక్ష్మి, సీఎంఎం డి. గోవిందరావు పాల్గొన్నారు.